## క్లుప్తంగా

### మెపా జిల్లా ఉపాధ్యక్షుడిగా నరేశ్



ములుగు రూరల్: ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా భూమ నరేశ్‌ను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో నరేశ్‌కు నియమకపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ.. తన ఎన్నికకు సహకరించిన జిల్లా అధ్యక్షుడు అచ్చునూరి కిషన్, రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్, ఉపాధ్యక్షుడు పొన్నం రాజు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు తాళ్ల రవిందర్, రామక్రిష్ణ, చిరంజీవిలకు కృతజ్ఞతలు తెలిపారు.

### సమ్మెకు మద్దతు



ములుగు రూరల్: సమగ్రశిక్షా ఉద్యోగులు, గిరిజన సంక్షేమ శాఖలో విధుల నిర్వహిస్తున్న ఉద్యోగుల సమ్మెకు రాయినిగూడెం ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు మద్దతు ప్రకటించారు. ఈ మేరకు శనివారం పాఠశాలలో ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన సమయంలో ఉద్యోగుల మద్దతు తెలపుతూ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కసన్‌సింగ్, ఈరులాల్, సంపత్, సాంబయ్య, రాందాస్, కృష్ణమూర్తి, పరంసింగ్, గోపిసింగ్, రవిందర్, నారాయణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### నివాళి



ఏటూరునాగారం: ఐటీడీఏలో ఏపీఓగా పనిచేస్తున్న బీమ్‌రావు, ఎస్‌డీసీ కార్యాలయం అటెండర్‌గా పనిచేస్తున్న లక్ష్మి ఈనెల 26న అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో శనివారం ఐటీడీఏ కార్యాలయంలో బీమ్‌రావు, లక్ష్మి చిత్రపటాలకు ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఓ రాజ్‌కుమార్, ఎస్‌ఓ సురేష్‌బాబు, అకౌంట్స్‌మేనేజర్ నర్సింగరావు, జేడీఎం కొండల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### అవార్డు గ్రహీతకు సన్మానం



వాజేడు: మండల పరిధిలోని అమడపాక గ్రామంలో భగవాన్ బుద్ధ అవార్డు గ్రహీత దుర్గం నగేశ్‌ను మండల నేతకాని సామాజిక వర్గం ప్రజలు శనివారం శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో శివకుమార్, కొండా చరణ్, కుమ్మరి రాంబాబు, వెంకటేష్, శేఖర్, సాంబశివరావు, కేశవరావు, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

### చర్య తీసుకోవాలని వినతి



వాజేడు: మండల పరిధిలోని చెరుకూరు గ్రామంలో ఉన్న హర్షిని ప్రైవేట్ పాఠశాలలో మౌలిక సదుపాయాలు లేవంటి వెంటనే చర్య తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నాయకులు శనివారం డీఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకుడు దీకొండ భరత్ మాట్లాడుతూ.. పాఠశాలలో కనీస మౌలిక సదుపాయాలు లేక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. జిల్లా ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్య తీసుకోవాలన్నారు. సోడి అశోక్, కోరం శేఖర్, రాజ్ కుమార్ ఉన్నారు.

### చీరల పంపిణీ



వాజేడు: మండల పరిధిలోని చెరుకూరులో జీటీఎస్ఎస్ఎస్ సంస్థ ఆధ్వర్యంలో వితంతువులకు శనివారం చీరలను పంపిణీ చేశారు. వాజేడు, వెంకటాపురం(కె) మండలాల పరిధిలోని చెరుకూరు, టేకులగూడెం, వీరాపురం, లక్ష్మీపురం, ఎస్సీ మర్రిగూడెం, బెస్తగూడెం, కమ్మరిగూడెం గ్రామాలకు చెందిన 30 మంది వితంతువులకు మిషన్ భగీరథ ఏఈ శ్రీనివాస్, చెరుకూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, పాస్టర్ శ్యామ్, చేతుల మీదుగా అందజేశారు.

# ఇసుక అక్రమ తరలింపు



జంపన్నవాగులో తవ్విన ఇసుకను పరిశీలిస్తున్న తహసీల్దార్ గిరిబాబు



జేసీబీ యజమానితో మాట్లాడుతున్న అధికారులు

- జంపన్నవాగులో తవ్వకాలను పరిశీలించిన తహసీల్దార్

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని జంపన్న వాగులో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. రెడ్డిగూడెం లోలెవల్ కాజ్‌వే సమీపంలో వాగులో నుంచి జేసీబీ ద్వారా ట్రాక్టర్‌లో ఇసుకను లోడింగ్ చేసి స్నానఘాట్టాల ఒడ్డున ఇసుక డంపు చేశారు. ఈ విషయం తహసీల్దార్ గిరిబాబుకు సమాచారం తెలియడంతో శనివారం జంపన్నవాగును సందర్శించి వాగులో ఇసుక తవ్విన ప్రదేశాన్ని పరిశీలించారు. ఇసుక తవ్వకానికి వినియోగించిన జేసీబీని పట్టుకున్నారు. అనుతులు లేకుండా ఇసుక త్వకాలు జరిపితే చర్యలు తీసుకుంటామని యజమానిని హెచ్చరించినట్లు సమాచారం. జేసీబీ స్వాధీనం చేసుకున్నారా? లేదా అనే విషయంపై తహసీల్దార్ గిరిబాబుకు ఫోన్ చేయగా స్పందించలేదు.

**లారీల్లో తరలింపు**

వాగులో నుంచి డంపు చేసిన ఇసుక రాత్రి సమయంలో లారీల్లో అక్రమంగా పట్టణ ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలుస్తుంది. అధికారుల నుంచి అనుమతులు లేకుండా దళారులు అక్రమ ఇసుక దందాకు పాల్పడుతున్నట్లు వేలాది రూపాయాలు సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పవిత్రమైన జంపన్నవాగులో అక్రమంగా ఇసుక తోడడంతో భుగర్భజలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉంది. వాగులో నుంచి ఇసుక ట్రాక్టర్లు స్నానఘాట్టాల మెట్లపై నుంచి వెళ్లడంతో స్నానఘట్టాలు దెబ్బతింటున్నాయి. అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్న రెవెన్యూ అధికారులు మాత్రం పట్టించుకోకపోవడంతో ఇసుక దళాలు పెట్రెగిపోతున్నారని ఆదివాసీ సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఇసుక తవ్వకాలను నిలిపి వేసి జంపన్న వాగు పవిత్రను కాపాడాలని ఆదివాసీలు డిమాండ్ చేస్తున్నారు.

## వర్గీకరణతోనే అన్ని వర్గాలకు న్యాయం

- ఎమ్మెస్పీ నాయకుడు ఇరుగు పైడి



మాట్లాడుతున్న ఇరుగు పైడి

ములుగు రూరల్: ఎస్సీ వర్గీకరణతోనే అన్ని వర్గాలకు రిజరేషన్లు లభించి న్యాయం జరుగుతుందని ఎమ్మెస్పీ జాతీయ నాయకుడు ఇరుగు పైడి మాదిగ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ ఆశయ సాధనలో భాగంగానే ఎస్సీ వర్గీకరణ పోరాటం చేస్తున్నామని అన్నారు. మాలలు తమ రాజకీయ పలుకుబడి ఉపయోగించి వర్గీకరణ అడ్డుకునేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. కుట్రలను తిప్పి కొట్టేందుకే వెయ్యి గొంతులు–లక్ష డప్పులతో మండే మాదిగల గుండె చప్పుళ్లు వినిపించడానికి శ్రీకారం చుట్టామని అన్నారు. అన్ని సామాజిక వర్గాలలో ఉన్న కళాకారులు ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా నిలవాలని అన్నారు. అనంతరం జిల్లా కళాకారుల నిర్మాణ కమిటీ ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా రొంటాల కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఇనుముల రమేశ్, ఉపాధ్యక్షుడిగా మందపల్లి నవీన్, కార్యదర్శిగా అమ్మపాట తిరుపతి, గౌరవ అధ్యక్షుడిగా గుగ్గిళ్ల సాగర్ నియమించారు. కార్యక్రమంలో మడిపెల్లి శ్యాంబాబు, ప్రసాద్, శంకర్, రాజేందర్, మల్లయ్య, నెమలి నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ములుగు రూరల్: జిల్లా కేంద్రంలో నేడు(ఆదివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు జిల్లా కేంద్రంలోని బస్టాండ్ నుంచి శివాలయం, ఫైర్ స్టేషన్, కృష్ణకాలనీ, కలెక్టర్ ఆఫీస్, హనుమాన్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం కలుగుతుందని తెలిపారు. అంతరాయానికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## కాస్తులో ఉన్న రైతులకు పట్టాలివ్వాలి




తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

- రైతు సంఘం నాయకులు

గోవిందరావుపేట: కాస్తులో ఉన్న రైతులకు పట్టాలు ఇవ్వాలని మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ.. మండలంలో వందలాది మంది రైతులకు పట్ట లేక ప్రభుత్వ పథకాలు వర్తించక బ్యాంక్ రుణాలు రాక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. కాస్తు కాలంలో ఉన్న ప్రతి రైతుకు పట్టా ఇవ్వాలని వారికి రైతు భరోసా వర్తింప జేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతులందరు కలిసి తహసీల్దార్ సృజన్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం మండల అధ్యక్షుడు గుండు రామస్వామి, కార్యదర్శి రామ చంద్ర రెడ్డి, సోమా మల్లారెడ్డి, చిట్టిబాబు, సదానందం, మహేందర్, సారయ్య, నాగరాజు, లెనిన్, రాజు, ఉపేంద్ర చారి, శ్రీను, రాజయ్య, కృష్ణ, నగేష్, కృష్ణారావు, సాంబయ్య, యాదిరెడ్డి, కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు తదితర రైతులు పాల్గొన్నారు.

# యువత మత్తుకు బానిస కావొద్దు

- ఎస్సై తాజుద్దీన్



వెంకటాపురం(కె): తనిఖీ చేస్తున్న పోలీసులు



ఏటూరునాగారంలో..

ఏటూరునాగారం: యువత మత్తుకు బానిస కావొద్దని ఎస్సై తాజొద్దీన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్, ఆర్టీసీ బస్సులు, ప్రధాన షాపులు, కూడళ్లలో పోలీసు స్నీఫర్‌డాగ్‌తో ముమ్మరంగా తనిఖీలను చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎస్పీ ఆదేశాల మేరకు డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రత్యేక శిక్షణ పొందిన స్నిఫర్‌తో డాగ్‌తో ముందస్తు చర్యల్లో భాగంగా గంజాయి, డ్రగ్స్, పేలుడు పదార్థాల కోసం తనిఖీలు చేపట్టామన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని, ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. గంజాయి లాంటి మత్తు పదార్థాలు సరఫరా చేస్తున్న వ్యక్తుల సమాచారం తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో సివిల్, సీఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

**వాహనాల తనిఖీ**

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని కిరాణాషాపులు, దుఖాణాలలో శనివారం వెంకటాపురం సీఐ బండారి కుమార్, ఎస్సై కొప్పుల తిరుపతి రావుల ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు డాగ్ స్క్వాడ్ బృందాలతో కలిసి ముమ్మరంగా తనిఖీలు చేశారు. షాపులను తనికీలు చేయటంతో పాటు మండల కేంద్రానికి వచ్చి వెళ్లే వామానాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.

## సమస్యలు పరిష్కరించాలి

- బీఎస్పీ ఇన్‌చార్జ్ శివకుమార్



మాట్లాడుతున్న శివకుమార్

వాజేడు: ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీల హక్కులను కాపాడుతూనే బహుజన నిరుపేద వర్గాల ప్రజల సమస్యలను ప్రభుత్వాలు మానవతా దృక్పదంతో పరిష్కరించాలని బీఎస్పీ కొత్తగూడెం భద్రాద్రి జిల్లా ఇన్‌చార్జ్ తడికెల శివకుమార్ అన్నారు. మండల పరిధిలోని మండపాక గ్రామంలో శనివారం బీఎస్పీ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశనికి ముఖ్య అతిథిగా శివ కుమార్ హాజరై మాట్లాడారు. భూమి హక్కు రాజ్యాంగ బద్ధమని అన్నారు. మండల పరిధిలోని మండపాకలో తాము నివసిస్తున్న, సాగు చేసుకుంటున్న భూములపై అనేక ఇబ్బంది ఎదుర్కొంటున్నట్లు తన దృష్టికి తీసుకు వచ్చినట్లు తెలిపారు. ఐదవ షెడ్యూల్ ఏర్పాటు చేసే నాటికి అక్కడే జీవిస్తున్న వారందరిని కొండ గిరిజనులుగా వృత్తి జాబితాలో చేర్చాలని అంబేడ్కర్ సూచించినప్పటికి అది అమలు కాక పోవడం వలన ఈ ఇబ్బందులు ఎదురవుతున్నట్లు వెల్లడించారు. భద్రాచలం నియోజకవర్గ అధ్యక్షుడు కొండా చరణ్, ఉపాధ్యక్షుడు కుమ్మరి రాంబాబు, తదితరులు ఉన్నారు.

### శబరికి బయల్దేరిన అయ్యప్ప మాలధారులు

ఏటూరునాగారం: మండలంలోని రామన్నగూడెం గ్రామంలోని గురుస్వామి అల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రామాలయంలో ఇరుముడులను అయ్యప్పస్వామి మాలధారులకు కట్టారు. పలు గ్రామాలకు చెందిన స్వాములు ఇరుముడి తలపైపెట్టుకొని శబరిమలకు బయలుదేరారు. కార్యక్రమంలో స్వాములు బొల్లె ఆదినారాయణ, అర్జున్, శ్రీరామ్, ప్రేమ్‌కుమార్, రాజేశ్వరచారి, కిరణ్, సతీష్, మణికంట, మహేష్, రాంబాబు పాల్గొన్నారు.

## రహదారి పనులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..



బ్రిడ్జి వద్ద పూడ్చిన గుంతలు

వాజేడు: మండల పరిధిలోని పూసూరు నుంచి ఏడ్జెర్లపల్లి వరకు నిర్మిస్తున్న రహదారి మధ్యలో నిలిపివేయడంతో ప్రయణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఈ నెల 24న 'రహదారి పనులు పూర్తయ్యేది ఎప్పుడో' అనే కథనం 'సాక్షి' ప్రచురితమైంది. రహదారి పనులను తిరిగి శనివారం ప్రారంభించారు. రహదారి వెంట ఉన్న గుంతలను టిప్పర్ల ద్వారా నింపారు. రహదారి మధ్యలో ఉన్న రెండు బ్రిడ్జిల వద్ద వాహనాలు వెళ్లదానికి అనుకూలంగ కంకర పోశారు. పూసూరు నుంచి బొమ్మన పల్లి వరకు గుంతలుగా మారిన రహదారిని చదును చేస్తున్నారు.

### విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ



ప్లేట్లు పంపిణీ చేస్తున్న ఎంఈఓ మేనక

మంగపేట: మండలంలోని రేగులగూడెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు జ్వాలా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చైర్మన్ కోడెల నరేశ్ సమక్షంలో ఎంఈఓ పాదెం మేనక శనివారం ప్లేట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేనక మాట్లాడుతూ.. విద్యార్థులు శ్రద్ధతో చదువుకుని ఉన్నత స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలోపాఠశాల హెచ్ఎం మాలోత్ రాజు, కమలాపురం కాంప్లెక్ హెచ్ఎం శ్రీనివాస్, ట్రస్టు ప్రధాన కార్యదర్శి రాకేశ్, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

## సమస్యలను సంఘం దృష్టికి తీసుకురావాలి

- విశ్రాంతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సారయ్య



సమావేశంలో మాట్లాడుతున్న సారయ్య

ఏటూరునాగారం: పెన్షనర్లు(విశ్రాంతి)ఉద్యోగుల సమస్యలను తెలంగాణ ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల సంఘం దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కారం చూపుతామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పాల్తియ సారయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో 42వ జాతీయ పెన్షన్‌దారుల దినోత్సవం సందర్భంగా సమావేశం నిర్వహించారు. దివంగత ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపం వ్యక్తం చేసి నివాళులర్పించారు. అనంతరం సారయ్య మాట్లాడుతూ.. పెన్షనర్లు ఎలాంటి సమస్యలున్న సంఘం సభ్యులకు తెలపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బాసాని రామ్మూర్తి, చామర్తి రామేశ్వర్‌రావు, బానోతు సేవ్లా, జీవీఎస్ రాంప్రసాద్ పాల్గొన్నారు.

## సీఆర్‌టీలను క్రమబద్ధీకరించాలి

- టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు



సమావేశంలో మాట్లాడుతున్న పల్లె నాగరాజు

ఏటూరునాగారం: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్స్‌ను క్రమబద్ధీకరించి కనీస వేతనం చెల్లించాలని తెలంగాణ ప్రోగ్రెస్సివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐటీడీఏ కార్యాలయం ఎదుట సీఆర్‌టీలు చేస్తున్న నిరవధిక సమ్మె శిబిరాన్ని ఆయన శనివారం సందర్శించి సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్స్ 20సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నారని తెలిపారు. గిరిజన విద్యాభివృధికి కృషి చేస్తున్న సీఆర్‌టీలకు కనీసవేతనం అమలు కాక శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం అమలు కాక సీఆర్‌టీలు మనోవేదన అనుభవిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సీఆర్‌టీల ప్రధాన డిమాండ్‌లను నెరవేర్చి సమ్మె విరమింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ మండల అధ్యక్షులు బి.రాజు, కార్యవర్గ సభ్యులు కె.సతీష్ పాల్గొన్నారు.

## జీపీ కార్యాలయానికి స్థలం కేటాయించాలి

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని నార్లాపూర్ గ్రామంలో నూతన గ్రామపంచాయతీ నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని గ్రామస్తులు అధికారులను కోరారు. శనివారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామ సభకు తహసీల్దార్ గిరిబాబు హాజరు కాగా ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. నూతన గ్రామ పంచాయతీ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలం కేటాయించాలని గ్రామస్తులు కోరారు. ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించి గ్రామపంచాయతీ నిర్మాణానికి కేటాయిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శి ధర్మేందర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు తండాల శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు పైడిపల్లి అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ములుగు రూరల్: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన జిల్లా కేంద్రంలోని ఆర్‌టీఏ కార్యాలయం వద్ద జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గంగిరేనిగూడెం గ్రామానికి చెందిన సుధాకర్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై ములుగు మండలం సర్వాపురం గ్రామంలో ఉన్న బంధవుల ఇంటికి వెళ్లి తిరిగి ములుగు మీదుగా వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఆర్టీఏ కార్యాలయం వద్దకు రాగానే రాంగ్ రూట్‌లో ఎదురుగా మరో బైక్‌పై వస్తున్న వ్యక్తి సుధాకర్ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో సుధాకర్‌కు గాయాలు కాగా స్థానికులు 108 వాహనంలో ములుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## మహిళను కాపాడిన పోలీసులు



సమ్మక్కతో పోలీసులు

ఏటూరునాగారం: ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న మహిళను ఏటూరునాగారం పోలీసులు కాపాడారు. ఎస్సై తాజొద్దీన్ కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని బెస్తవాడకు చెందిన ఇంద్రారపు సమ్మక్క భర్త తిరుమలరావు గత రెండేళ్ల క్రితం కేన్సర్‌తో బాధపడుతూ చనిపోయాడు. దీంతో సమ్మక్క తల్లిగారి ఇళ్లు అయిన మద్దెడు నుంచి అత్తవారింటికి ఏటూరునాగారం రావడంతో ఆస్తి పంపకాల గొడవ జరిగింది. అత్త ఇబ్బందులకు గురిచేస్తోందని, సూటిపోటి మాటలకు మనస్థాపం చెంది జీవితం మీద విరక్తితో చనిపోదామని శనివారం సాయంత్రం ముళ్లకట్ట బ్రిడ్జి మీద నుంచి ఆత్మహత్యాయత్నంకు పాల్పడే సమయంలో సమాచారం వచ్చిందన్నారు. తమ సిబ్బందితో కలిసి ఆమెను రక్షించి అక్కడి నుంచి తీసుకొని స్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే ఆత్మహత్యాయత్నంకు పాల్పడవద్దని, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని బాధితురాలిని కోరామన్నారు.

# సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



చెక్కులు అందజేస్తున్న నాయకులు

- కాంగ్రెస్ నాయకుడు సదానందం

ములుగు రూరల్: సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని కాంగ్రెస్ పార్టీ నాయకుడు ముత్తినేని సదానందం అన్నారు. శనివారం మండలంలోని జగ్గన్నపేటలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పోరేట్ వైద్యం పొందిన నిరుపేదలకు వైద్యం ఖర్చులు భారం కాకుండా సహాయ నిధి ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో సంగని శ్రీనివాస్, శ్రీహరి, కిట్టయ్య, విష్ణు, నరేష్, రాజు, అశోక్, వేణు, తదితరులు పాల్గొన్నారు.

### చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మంగపేట: చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని మల్లూరు గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మల్లూరుకు చెందిన పూజరి మల్లికార్జున్(40) కుటుంబ గొడవల నేపథ్యంలో ఈనెల 16న గడ్డి మందు తాగాడు. హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించి నయం కాకపోవడంతో ఇటీవల ఇంటికి తీసుకోచ్చారు. ఈక్రమంలో ఇంటి వద్ద శుక్రవారం రాత్రి మృతి చెందాడు. కాగా, మృతుడి భార్య దివ్య కూడా అతడు తాగిన రోజే గడ్డి మందు తాగి అదే రోజు మృతి చెందింది.

### 'తేమ శాతం వచ్చినా తూకం వేస్తలేరు..'

మల్లూర్: ధాన్యం తేమ శాతం వచ్చిన కొనుగోలు కేంద్రం నిర్వాహకులు తూకం వేస్తలేరని రైతులు వాపోతున్నారు. మండలంలో ఇప్పలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. రైతులు లచ్చయ్య, రమేశ్, సురేందర్, సూర్యనారయణ ఉన్నారు.